

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి - 8లో▸

వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు ఆదేశించారు.



జాబ్ ఇస్తామని..

మీకు మా సంస్థలో పర్మనెంట్ ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి నిరుద్యోగుల నుంచి డబ్బులు లాగేసిన ఘటన గీసుకొండ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. - 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0°/26.0°

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలు చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయి సదస్సుకు ఆహ్వానం

పాలకుర్తి టౌన్: ఈ నెల 21న జోగులాంబ గద్వాల జిల్లాలోని బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని జరుగనున్న రాష్ట్ర స్థాయి అర్చకుల సదస్సుకు కేంద్ర సంఘ అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్‌ను ఆహ్వానించారు. ఆదివారం ఆయనను కలిసి ఆహ్వాన పత్రం అందించిన అనంతరం సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి అర్చక ఉద్యోగ సదస్సుకు రాష్ట్ర జేఏసీ కన్వీనర్ డీవీఆర్ శర్మ, ఉమ్మడి జిల్లా నాయకులు అభిలాష శర్మ తదితరులు ఉన్నారు

ఈనెల 20న వ్యాసరచన పోటీలు

కొడకండ్ల : జాతీయ ప్లాస్టిక్ రహిత దినోత్సవం సందర్భంగా ఈ నెల 20న 8, 9, 10వ తరగతుల విద్యార్థులకు రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు గోశాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు భాషలో పాఠశాల నుంచి గుర్తించబడిన సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకాన్ని ఎలా తగ్గించాలనే అంశంపై పోటీలు నిర్వహించి సమాఖ్య ద్వారా బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. పూర్తి వివరాలకు 9394005600కు ఫోన్ చేయాలని ఆయన కోరారు.

బీజేపీ టిఫిన్ బైఠక్



జనగామ: రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు జనగామ బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంతరెడ్డి ఆధ్వర్యంలో జనగామ చంపక్‌హిల్స్‌లో టిఫిన్ బైఠక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దశమంతరెడ్డి మాట్లాడుతూ ప్రజాసంక్షేమాన్ని విస్మరిస్తున్న బీఆర్ఎస్‌ను ప్రజలు ఇంటికి పంపించేందుకు ఎదురు చూస్తున్నారన్నారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో జనగామ గడ్డపై బీజేపీ జెండా ఎగుర వేసేందుకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉడుగుల రమేష్, సౌడ రమేష్, శివరాజ్ యాదవ్, బురుగు సురేష్ గౌడ్, బేజాడి బీరప్ప, బొట్ల శ్రీనివాస్, మార్క ఉపేందర్, మాలతి, లక్ష్మారెడ్డి, గుజ్జుల నారాయణ, మహిపాల్, మహేందర్‌రెడ్డి, తిరుపతి యాదవ్, రాజు, ఆవుల శ్రీనివాస్, పాండు, సంపత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

జనగామ:సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఓ గార్డెన్‌లో ఆదివారం తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో వ్యాస మహర్షి జయంతిని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. అంతకు ముందు ఎమ్మెల్సీతో పాటు డీఈఓ రామ్, సౌమిత్రి లక్ష్మణాచారి, సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్, రాష్ట్ర బాధ్యులు నర్సింహారావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్కారు బడుల్లో చదువుకునే పిల్లలు ఆణిముత్యాల్లాగా తీర్చి దిద్దబడుతున్నారన్నారు.

సోషల్ వెల్ఫేర్ స్కూల్ సందర్శన

జనగామ: జనగామ పట్టణంలోని హన్మకొండ రోడ్డు సోషల్ వెల్ఫేర్ స్కూల్‌ను ఆదివారం ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం ఆధ్వర్యంలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులపై ఉపాధ్యాయుల పర్యవేక్షణ లేదన్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వికాస్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

శ్రమకు తగిన ఫలితమేది..?



చాలీచాలని వేతనాలతో మల్టీపర్పస్ కార్మికుల అవస్థలు

- కనీసవేతనం, ఉద్యోగ భద్రత కరువు
- జిల్లా వ్యాప్తంగా 1,080 మంది..
- డిమాండ్ల సాధనకు సమ్మెలోకి..
- పల్లెల్లో నిలిచిన పారిశుద్ధ్య పనులు

జనగామ రూరల్: ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న మల్టీపర్పస్ కార్మికుల సమస్యలు వర్ణనాతీతం. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు వచ్చే అరకొర వేతనం ఎటు సరిపోక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే కనీసవేతనం, ఉద్యోగ భద్రత తదితర డిమాండ్లతో కార్మికులు ఈనెల ఆరో తేదీ నుంచి సమ్మె బాట పట్టారు. దీంతో పల్లెల్లో పారిశుద్ధ్య, ఇతర పనులు స్తంభించి పోయాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినా అవి ఏమూలకూ సరిపోవడం లేదు.

281 జీపీలు.. 1,080 మంది కార్మికులు

జిల్లా వ్యాప్తంగా 281 జీపీలు ఉండగా.. 1,080 మంది కార్మికులు (మల్టీపర్పస్) విధులు నిర్వహిస్తున్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా మరో 25 శాతం మంది అదనంగా ఉండాలి. ఒక్కో కార్మికుడికి నెలకు రూ.8,500 వేతనం చెల్లించేవారు. నెలంతా చాకిరి చేసినా వచ్చే అరకొర జీతం సమయానికి రాకపోవడంతో కుటుంబాలు గడవక పడరాని పాట్లు పడుతున్నారు. రెండు నెలల క్రితం ప్రభుత్వం రూ.1,000 పెంచగా.. రూ.9,500 ఇస్తున్నారు. అరకొరగా పెంచిన ఈ జీతంతో కనీస అవసరాలు కూడా తీరే పరిస్థితి లేదు. ఇప్పటికే పలు గ్రామాల్లో మూడు నుంచి ఐదు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇల్లు గడవడానికి అప్పులు చేయాల్సి వస్తోందని పలువురు కార్మికులు వాపోయారు.



సమ్మె చేస్తున్న జీపీ కార్మికులు



చెత్త సేకరిస్తున్న గానుగుపహాడ్ సర్పంచ్ శ్రీనివాస్

గ్రామాల్లో నిలిచిన పనులు

తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ జీపీ కార్మికులు సమ్మె బాట పట్టడంతో గ్రామాల్లో పనులు నిలిచి పోయాయి. ముఖ్యంగా పారిశుద్ధ్యం, చెత్త తొలగింపు, ట్రాక్టర్ నిర్వహణ, వీధి లైట్లు, తాగునీటి సరఫరా తదితర పనులు చేపట్టడానికి ప్రజాప్రతినిధులు ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల్లో రోజువారీగా 300 నుంచి 500 వరకు మందికి రోజువారీ కూలి చెల్లించి పనులు చేయిస్తున్నారు. నిధులు లేని చిన్న పంచాయతీల్లో సర్పంచ్‌లే చెత్త సేకరణ వంటి పనులు నిర్వహిస్తున్నారు. ట్రాక్టర్ డ్రైవర్స్, వాటర్ మెన్లు, కారోబార్లు సహకారం అందిస్తున్నారు.

ఇవీ కార్మికుల డిమాండ్లు..

- జీపీ కార్మికులను పర్మనెంట్ చేసి జీఓ 60 ప్రకారం స్వీపర్లకు రూ.15,600, బిల్ కలెక్టర్, కారోబార్‌లకు రూ.19,500 చెల్లించాలి.
- ప్రతి నెలా రెగ్యులర్‌గా వేతనాలు ఇవ్వాలి
- జీఓ 51ని సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి
- ప్రతి కార్మికుడికి ప్రమాద బీమా రూ.10 లక్షలు, దహన సంస్కారాలకు రూ.30 వేలు ఇవ్వాలి
- రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.5 లక్షలు చెల్లించాలి
- ఏడాదికి కార్మికులకు మూడు జతల యూనిఫాం, చెప్పులు, సబ్బులు, నూనెలు వంటివాటి కొనుగోలుకు నగదు రూపంలో అలవెన్స్ చెల్లించాలి
- ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయం కల్పించి 8 గంట పని విధానం అమలు చేయాలి. అక్రమ తొలగింపులను ఆపి ఉద్యోగ భద్రత కల్పించాలి.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి



జీపీ కార్మికులతో అన్ని రకాల పనుల చేయించుకుంటూ ప్రభుత్వం వేతనాలు ఇవ్వకపోవడం దారుణం. అరకొర జీతాలు కూడా మూడు నెలల నుంచి రాకపోవడంతో ఇళ్లు గడవడం భారంగా మారింది. తక్షణమే ప్రభుత్వం కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తాం.

– రాపర్తి రాజు, జీపీ ఉద్యోగ కార్మికుల జేఏసీ జిల్లా చైర్మన్

కుటుంబం గడవడంలేదు..



నిత్యావసరాల సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. జీతాలు చూస్తే అరకొరగా ఉన్నాయి. అవి కూడా సకాలంలో అందక కుటుంబం గడవడం కష్టంగా మారింది. ఇద్దరు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నా. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాం. సమస్యలు పరిష్కరించాలి.

– మల్లేష్ జీపీ కార్మికుడు, ఎర్రగొల్లపహాడ్

శాకంబరి అలంకరణలో ఉప్పలమ్మతల్లి

జనగామ: ఆషాఢ మాసం చివరి ఆదివారం పురస్కరించుకుని జిల్లా కేంద్రం 27వ వార్డులోని శ్రీ ఉప్పలమ్మ సహిత ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పలమ్మ అమ్మవారు శాకంబరి అలంకరణలో భక్తు లకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన పూజారి వారణాసి పవన్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని కూరగాయలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త, మధుతో పాటు ఆలయ ఈఓ వంశీ, క్లర్క్ మధు, భక్తులు ఆరుట్ల దశమంత రెడ్డి, శోభ, అనంతరెడ్డి, చెంచారపు వీరారెడ్డి, కూరగాయల లింగయ్య, చెంచారపు శ్రీరాంరెడ్డిచ లోకమంతెడ్డి, బండ యాదగిరిరెడ్డి, ఓరుగంటి ఆంజనేయులు, గట్టు దామోదర్, ధర్మపురి శ్రీనివాస్, మారం రవి, లగిశెట్టి వీరలింగం, శ్రీనివాస్, సురేష్‌రెడ్డి, మహంకాళి శ్రీనివాస్, చెంచారపు బుచ్చిరెడ్డి, చెంచారపు పల్లవి, ఠాకూర్, చెంచారపు భరత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





అమ్మవారి ఆలయంలో భక్తుల పూజలు

వైభవంగా ఆరుద్రోత్సవం

పాలకుర్తి టౌన్: సోమేశ్వర లక్ష్మినరసింహస్వామి దేవాలయంలో ఆదివారం మాస శివరాత్రి, ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని నూతనంగా ఆరుద్రోత్సవం కార్యక్రమం మేళ తాళాలు అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య వైభవోపేతంగా జరిగింది. సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు ఏకాదశి రుద్రాభిషేకం ఆవు పాలు 108 లీటర్లతో అభిషేకం గర్భాలయం దీపోత్సవం పుష్పాలంకరణ, విశేష నీరాజనములు మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణ, మాస శివరాత్రి సందర్భంగా చండిక అమ్మవారి ఆలయంలో చండిక సమేత శ్రీ సోమేశ్వరస్వామి వారికి మాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొని కనులార తిలకించి తరలించారు. భజన బృందాలచే భజన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ భాగం లక్ష్మి ప్రసన్న, ఆలయ చైర్మన్ వెనుకదాసుల రాంచంద్రయ్య శర్మ, అర్చకులు, ధర్మకర్తలు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



దీపాలంకరణలో..



అభిషేక పూజలో పాల్గొన్న భక్తులు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

లింగాలఘణపురం: గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని డీపీఓ రంగాచారి అన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో ఎంపికైన సిరిపురం గ్రామాన్ని ఆదివారం డీపీఓ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, మరుగుదొడ్డి తప్పనిసరిగా ఉండాలని కోరారు. అదేవిధంగా వీధుల్లో చెత్తవేయొద్దని, ఇంటికి వచ్చే ట్రాక్టర్‌లో వేయాలని సూచించారు. ఇంకుడు గుంతలు లేని వారు ఇంటి వద్ద ఇంకుడు గుంతను నిర్మించుకొనే విధంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంకుడు గుంతలు లేని ఇళ్లను గుర్తించి నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు. డీపీఓతో పాటు ఎంపీడీఓ మల్లికార్జున్, పంచాయతీ కార్యదర్శి శంకర్ తదితరులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న డీపీఓ రంగాచారి

డ్రైవింగ్ లైసెన్స్‌లను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

జనగామ: ఉచిత డ్రైవింగ్ లైసెన్స్‌లను నిరుపేద యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుకింగ్ పత్రాలు పంపిణీ, సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చేర్యాలకు చెందిన బీటెక్ విద్యార్థి పోలీసులు తనిఖీ చేస్తున్న విషయాన్ని గమనించి, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడంతో వేగం పెంచి, పక్కనే ఉన్న స్పీడ్ బ్రేకర్‌పై ఎగిరి కింద పడ్డాడన్నారు. దీంతో తల, శరీర భాగాలకు తీవ్ర గాయాలపాలై సిద్దిపేట ఆస్పత్రిలో చేరగా, తాను స్వయంగా వెళ్లి పరామర్శించడం జరిగిందన్నారు. పోలీసులకు పట్టుబడితే జరిమానా చెల్లించలేని పరిస్థితిలో వేగంగా వెళ్లి ప్రమాదానికి గురయ్యాడని, లైసెన్స్ ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. ఇలాంటి ఘటనలు నియోజకవర్గంలో ఎదురు కావద్దని అర్హులైన యువతీ, యువకులకు డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పిస్తున్నామని, ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇప్పటి వరకు 8 వేలు పూర్తి కాగా, మరో 10వేల వరకు వచ్చే అవకాశం ఉందన్నారు. అంతకు ముందు ర్యాష్ డ్రైవింగ్ చేయమని యువకులతో ఎమ్మెల్యే ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమం లో పీఏసీఎస్ చైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, యూత్ నాయకులు ఉల్లెంగుల సందీప్, దేవునూరి సతీష్, లెనిన్ ఉన్నారు.



ఉచిత డ్రైవింగ్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే

జిల్లా ఆస్పత్రి తనిఖీ

జనగామ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుగుణాకర్ రాజుతో కలిసి ఎమ్మెల్యే జనరల్ వార్డుతో పాటు ఎమర్జెన్సీ, నిర్వహణ, వైద్యుల పనితీరు, తదితర సేవలపై ఆరా తీశారు.

రైతు సమావేశాలను జయప్రదం చేయండి

వ్యవసాయ రంగంతో పాటు రైతుకు అండగా నిలిచేందుకు అమలు చేస్తున్న పథకాలపై నేటి నుంచి ఈ నెల 26వ తేదీ వరకు జరిగే రైతు సదస్సులను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి కోరారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

త్వరలో కొమురయ్య జీవిత గాథపై సినిమా



సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

జనగామ: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జీవిత గాథపై సినిమా నిర్మిస్తున్నట్లు పలు కుల సంఘాల జిల్లా అధ్యక్షులు తెలిపారు. పట్టణంలోని కురుమ భవన్‌లో ఆదివారం కురుమ సంఘం అధ్యక్షుడు బాల్దె మల్లేశం అధ్యక్షతన దొడ్డి కొమురయ్య సొసైటీ, దొడ్డి కొమురయ్య మూవీ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో అఖిల భారత విశ్వకర్మ రాష్ట్ర అధ్యక్షుడు కొలే జగన్నాథం ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం బాల్దె మల్లేశంతో కలిసి ఆయన మట్లాడుతూ దొడ్డి కొమరయ్య సినిమా చిత్రీకరణకు అన్ని వర్గాలకు చెందిన కుల సంఘాలు సహకారం అందించడం సంతోషమన్నారు. జనగామ జిల్లా కమిటీకి చైర్మన్‌గా బాల్దే మల్లేశం కురుమ, సభ్యులుగా నాయిబ్రాహ్మణ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి వెంకటేష్, విశ్వకర్మ జిల్లా అధ్యక్షుడు దిగోజు నరసింహాచారి, వీరబద్రీయ జిల్లా అధ్యక్షుడు మిట్టపల్లి సంతోష్, శాలివాహన కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షుడు నీలిగొండ రాములు, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు దోర్నాల వెంకటేష్, ఎంపీటీసీ పేర్ని ఉష, మున్సిపల్ కౌన్సిలర్ పేర్ని స్వరూప, విశ్వకర్మ రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు మద్దోజు గంగాభవానిని ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపేంద్ర, సోమేష్, సాంబాచారి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించిన ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ అన్నారు. ఈనెల 20న హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల సదస్సును పురస్కరించుకుని ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో చలో హైదరాబాద్ పోస్టర్లను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఘన్‌పూర్ నియోజకవర్గ అధ్యక్షుడు గుర్రం ఫాతికుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ చీమ శ్రీనివాస్ మాట్లాడారు. ఎన్నో సంవత్సరాలు పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యమ లక్ష్యాలు నెరవేరడం లేదని, రాష్ట్ర సాధనయే ధ్యేయంగా ఆత్మ బలిదానాలు చేసుకున్నారన్నారు. తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి రూ.పదివేల కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని, అన్ని రాజకీయ పార్టీలు ఉద్యమకారులకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఉచిత బస్సు, రైలు ప్రయాణ సౌకర్యాలు కల్పించాలని, పెన్షన్ అందించాలని, ప్రభుత్వ పథకాల్లో ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పి.సురేందర్‌రెడ్డి, నర్రా సంపత్, రాంబాబు, పెంటాచారి, కొంతం వీరస్వామి, గుర్రం ఫాతికుమార్, సీరటి రవి,రహ్మతుల్లా, అజీముద్దీన్, శ్రీరాముల రవి, పింగిలి చంద్రమౌళి, వంగ వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న చీమ శ్రీనివాస్

రోడ్డెక్కాల్సిందేనా?

- దుర్గామాత కాలనీకి రోడ్డు లేదంటా!
- ఇంటి అనుమతులు ఎలా ఇచ్చారో?
- తొలిబోనం కాలనీ నుంచే..
- దసరా, బతుకమ్మ ఉత్సవాలకూ ఇదే దారి

జనగామ: ఓ కాలనీ.. రెండుదారులు.. ఇదేంటని అనుకుంటున్నారా.. ఇక్కడే ట్విస్ట్ ఉంది. రెండు దశాబ్దాలకు పైగా నివాసముంటున్న కాలనీవాసులకు దేవాదాయ శాఖ అధికారులు బిగ్ షాక్ ఇచ్చారు. కాలనీకి రోడ్డు లేదంటూ మూసివేయడంతో సుమారు 150 కుటుంబాలు రోడ్డెక్కాల్సిన పరిస్థితి నెలకొంది. కాలనీ వాసుల మొర ఆలకించకుండా... ఎండోమెంట్ బాస్‌లు తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. దారి కోసం మరో పోరాటానికి సిద్ధమవుతున్నారు జనగామ దుర్గామాత కాలనీ వాసులు. జిల్లా కేంద్రం సూర్యాపేట రోడ్డు సమీకృత కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో దుర్గామాత కాలనీ వాసుల గోస వర్ణనాతీతం. రెండు దశాబ్దాలకు పైగా కాలనీలో 150 కుటుంబాలకు పైగా నివాసముంటున్నారు. ఇందులో ఎక్కువగా ఉద్యోగులు, వ్యాపారస్తులు ఉన్నారు. కాలనీకి రెండు వైపులా రహదారులు ఉండగా.. రెండు నుంచి మూడు వరకు లింకు రోడ్లు ఉన్నాయి. కాలనీ నుంచి బతుకమ్మకుంట, అక్కడే ఉన్న దుర్గామాత టెంపుల్‌కు సైతం వెళ్లేందుకు దారి ఉంది. నేషనల్ హైవే పక్కన...కాలనీకి ఎదురుగా ఉన్న 78 సర్వే నంబర్‌లోని 39 గుంటల ఖాళీ జాగా దేవాదాయ శాఖ పరిధిలో ఉండడంతో... సంబంధిత అధికారులు కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఇక్కడ వరకు అంతా బాగానే ఉన్నా.. దారి విషయంలో వివాదం నెలకొంది. కాలనీ రహదారులు సైతం దేవాదాయ శాఖ స్థలంలో ఉండడంతో... అధికారులు ఒక దారిని ఇనుప కంచెతో మూసి వేయడంతో వందలాది కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం నెలకొంది. ఆదివారం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిని కాలనీ వాసులు కలిసి, రోడ్డు విషయమై వినతి పత్రం అందించారు. ఏటా శ్రావణ మాసంలో తూర్పుఫేస్‌లో ఉన్న దారిగుండా దుర్గామాతకు తొలి బోనం తీసుకు వెళతారు. బతుకమ్మకుంటలో జరిగే దసరా, బతుకమ్మ ఉత్సవాల సమయంలో కూడా రెండు దారులు ఎప్పుడు రద్దీగా ఉంటాయి.

అనుమతులు ఎలా ఇచ్చారు...

కాలనీలో ఇళ్ల నిర్మాణ సమయంలో నిబంధనలను అనుసరిస్తూ.. మున్సిపల్ నుంచి అనుమతులు పొందారు. ఇంటికి సంబంధించిన అనుమతులతో పాటు నల్లా, కరెంటు కనెక్షన్లు సైతం పొందారు. అధికారికంగా డ్రెయినేజీ, సీసీ రోడ్లతో పాటు కనీస మౌలిక వసతి సౌకర్యాలను సైతం పొందుతున్నారు. కాలనీకి అధికారిక అనుమతులు ఉన్నప్పటికీ, దేవాదాయ శాఖ తీసుకున్న నిర్ణయంతో దారులు లేకుండా పోయే పరిస్థితి నెలకొంది. దీంతో అంబులెన్స్, స్కూల్ వాహనాలు, మున్సిపల్ చెత్త సేకరణ బండ్లు, ట్రాన్స్‌పోర్టేషన్ వాహనాలు కాలనీ లోపలకు రాలేని పరిస్థితి ఉంది. పైగా కాలనీకి వెళ్లే ఒక దారి మూసివేయగా తాత్కాలికంగా ఓ దారిని ఉంచారు. లోనకు వెళ్లాలంటే... 36 ఫీట్ల దారి గుండా లింకు రోడ్లను దాటుకుంటూ ఇంట్లోకి వెళ్లాలి. కాలనీ నిర్మాణ సమయంలో దారులు వదిలినప్పటికీ... వాటిని సైతం అమ్ముకున్నారని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. రోడ్డు కోసం రెండు రోజులుగా ఆందోళనలు, నిరసనలు జరుగుతున్నా మున్సిపల్ అధికారులు స్పందించక పోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



మూసివేసిన దారి వద్ద నిరసన తెలుపుతున్న బాధిత కుటుంబాలు

దారిని మూసి వేశారు



దుర్గామాత కాలనీ రోడ్డు నుంచి బతుకమ్మకంటలోని అమ్మవారి దేవాలయం ఏటా శ్రావణ మాసంలో తొలిబోనం తీసుకు వెళతారు. ఆలయానికి వెళ్లే దారిని దేవాదాయ శాఖ మూసి వేసింది. దీంతో కాలనీలో ఉన్న 150 కుటుంబాల పరిస్థితి ఏంటి?

– లకావత్ లాల్మానాయక్, దుర్గామాత కాలనీ

రోడ్డు లేకుంటే ఎలా?



రెండు దశాబ్దాలుగా ఇక్కడే ఉంటున్నాం. దేవాదాయ శాఖ భూమి ఉందని చెబుతున్న స్థలానికి ఎదురుగా 15 ఫీట్ల రోడ్డు ఉండాలి. ఆ స్థలం కూడా లేదంటున్నారు. దారి లేదు.. దుకాణాల ఎదుట సైకిల్ ఉంచే స్థలం ఉండదు.. ఇలా అయితే కాలనీలో ఎలా బతికేది.

– భూక్యా మల్లేష్ నాయక్, కాలనీ వాసి

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో తాపీమేస్త్రి మృతి


శ్రీనివాస్ (ఫైల్)

కమలాపూర్: మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కమలాపూర్‌కు చెందిన తాపీమేస్త్రి మామిండ్లపెల్లి శ్రీనివాస్ (45) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం శ్రీనివాస్ టీఎస్ 03 ఈఎస్ 8221 నంబరు గల ద్విచక్రవాహనంపై పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో హెచ్‌పీ పెట్రోల్ పంపు వద్దకు రాగానే పరకాల వైపు నుంచి హుజూరాబాద్ వైపునకు వెళ్తున్న టీఎస్ 02 ఈడీ 8267 నంబరు గల మారుతి ఆల్టో కారును డ్రైవర్ తాడెం సంతోష్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానిక ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు డ్రైవర్ సంతోష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంజీవ్ తెలిపారు.

యువతి అదృశ్యం


సృజన

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓసిటీకి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం..ఓ సిటీకి చెందిన బుడిమ సృజన(25) ఆదివారం ఉదయం సరుకులు తెస్తానని ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రమైనా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కిరాణం, స్నేహితులు, బంధువులు ఇళ్లు, బస్టాండ్, రైల్వేస్టేషన్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. సృజన సోదరుడు బుడిగ ప్రకాశ్ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

మహాముత్తారం: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన యువకుడు.. ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని సింగంపల్లిలో జరిగింది. గ్రామానికి చెందిన బందం నవీన్(25) రెండు సంవత్సరాల క్రితం ఏటూరునాగారం గ్రామానికి చెందిన జ్యోతిని కులాంతర వివాహం చేసుకున్నాడు. ఈ క్రమంలో కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో జ్యోతి తల్లిగారింటికి వెళ్లింది. రెండు రోజుల క్రితం నవీన్.. భార్యను కాపురానికి రావాలని కోరడంతో ఆమె నిరాకరించింది. దీంతో మనస్తాపానికి గురైన నవీన్ ఆదివారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మహాముత్తారం హెడ్‌కానిస్టేబుల్ రాజయ్య తెలిపారు.

ఇక..నాటుకోవడమే

- నారుమడి లేకుండానే వరి నాటు
- సాగులో ఖర్చు తగ్గించుకునే అవకాశం
- ఆధునిక వ్యవసాయం వైపు అన్నదాతల అడుగులు

చినుకు కురిసింది మొదలు.. చివరి గింజ సంరక్షణ వరకు..పంటను మడి (పొలం) నుంచి మార్కెట్‌కు తరలించే వరకు అన్నదాతకు పెట్టుబడి ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి. పొలం దున్నడం.. మండె పోయడం.. మొలక అలకడం.. నారు తీయడం, నాటు వేయడం.. కలుపుతీయడం.. పంటను కోయడం.. మార్కెట్‌కు తరలించడం.. ఇలా ప్రతీ దశ ఖర్చుతో కూడుకుంది. దీంతో రైతులు వేలాది రూపాయల పెట్టుబడితో పంటలు సాగు చేసే బదులు 'ఖర్చు' తగ్గించుకునేందుకు మార్గాలు ఎంచుకుంటున్నారు. ఇందులో భాగంగా 'వరి' సాగులో ఇప్పుడు నారు మడి నుంచే పెట్టుబడి తగ్గించుకోవడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. నారు మడి లేకుండా నేరుగా పొలంలో 'విత్తు'కునే పద్ధతి వైపు అడుగులు వేస్తున్నట్లు అవగతమవుతోంది. ఖర్చు తగ్గడంతోపాటు యంత్రాలతో నాటు వేయడం మూలంగా రూ.3 నుంచి రూ. 4 వేలు పెట్టుబడి తగ్గడమే కాకుండా 8–10 రోజులు ముందుగా పొలాలు కోతకు వచ్చే అవకాశం ఉండడంతో రైతులు యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

– కరీమాబాద్


యంత్రం ద్వారా నాటు వేస్తున్న రైతు

దమ్ముచేసిన పొలంలో..

ఇటీవల వరి సాగులో ఖర్చులు పెరగడం.. కూలీల కొరత మూలంగా రైతులు దమ్ము చేసిన పొలంలో మొలకెత్తిన విత్తనాలు నేరుగా చల్లే పద్ధతిపై ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. వర్షాలు ఆలస్యమైన నేపథ్యంలో స్వల్పకాలిక రకాలను సాగు చేసుకుంటే దిగుబడి కూడా సాధించొచ్చు. పొలంలో వెదజల్లే పద్ధతిని బట్టి ఎకరాకు 10–12 కిలోల విత్తనాలు, డ్రమ్ సీడర్ ద్వారా అయితే 8–10 కిలోల విత్తనాలు అవసరమవుతాయి. విత్తనాలను 24 గంటలు నానబెట్టిన అనంతరం వాటిని గోనె సంచిలో మండెకట్టి మొలకెత్తిన విత్తనాన్ని దమ్ముచేసిన పొలంలో చల్లుకోవాలి. అదే డ్రమ్‌సీడర్ ద్వారా అయితే విత్తనాలను 12 గంటలు నానబెట్టి 24 గంటలు మండెకట్టి కొద్దిగా ముక్కు పగిలిన(తెల్లపూస) గింజలను విత్తుకోవాలి.

పాలిథిన్ షీట్లు, ట్రేలలో వరినారు పెంచి యంత్రాలతో నాటు..

మామూలుగా పూలు, మిరపమొక్కలు ట్రేలలో పెంచినట్లుగానే ఇప్పుడు వరి నారును కూడా పాలిథిన్ షీట్లు, ట్రేలలో పెంచుతున్నారు. అలా పెరిగిన నారును యంత్రాల ద్వారా పొలంలో నాట్లు వేస్తున్నారు. నారు పెంచే మడిని రెండు సార్లు దున్ని విత్తనం వేసే రోజు కన్నా 24 గంటలు ముందుగా దమ్ము చేసుకోవాలి. ఆ మడుల మీద 1.5 మీటర్ల వెడల్పు, సరిపడా పొడవున్న తెల్లని పాలిథిన్ షీట్‌ను మడతలు పడకుండా పరచాలి. ఒక్కో మ్యాట్ 58 సెం.మీ పొడవు, 28 సెం.మీ వెడల్పు, 2 సెం.మీ ఎత్తు ఉండేలా 8 మ్యాట్లు ఏర్పాటు చేసుకోవాలి. చెక్క ఫ్రేమ్ పాలిథిన్ షీట్‌లపై ఉంచి దమ్ము చేసిన బురదమట్టిని రాళ్లు లేకుండా చూసి ఫ్రేములలో నింపాలి. ఈక్రమంలోనే 24 గంటలు నానబెట్టి, 24 గంటలు మండెకట్టి మొలకెత్తిన వరి గింజలను ఫ్రేములలోని ఒక్కో కానాలో 120(సన్నగింజ) గ్రాములు, 160 గ్రాములు(దొడ్డుగింజ అయితే) వచ్చేలా చల్లుకోవాలి. ఎకరాకు సన్నగింజ అయితే 8–10 కిలోలు, దొడ్డుగింజ అయితే 12–14 కిలోల విత్తనాలు అవసరమవుతాయి.

ఆరుతడి (ఎరోబిక్ రైస్) పద్ధతిలో...

ఈ పద్ధతిలో వరిని సాధారణంగా మొక్కజొన్న పంటల మాదిరిగానే ఆరుతడి పరిస్థితులలో పండించొచ్చు. పంట అవసరం మేరకు నీటిని అందించాల్సి ఉంటుంది. మాగాణి భూముల్లో సాధారణ పద్ధతిలో సాగు చేయడానికి నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాలలో పండించే భూముల్లో, అడపాదడపా నీరు అందించే సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో ఆరుతడి పద్ధతి అనుకూలంగా ఉంటుంది. దమ్ము చేసి నీరు నిల్వ ఉంచాల్సిన అవసరం ఉండదు. బెట్టను తట్టుకునే స్వల్పకాలిక రకాలు ఈ పద్ధతికి అనుకూలంగా ఉంటాయి. ఎకరానికి 25–30 కిలోల విత్తనం అవసరముంటుంది. విత్తనాలు వేసే ముందు ఎకరాకు 24 కిలోల భాస్వరం, 16 కిలోల పొటాష్ ఎరువులు వేసి దుక్కి కలియదున్నాలి. నాగటి సాలు వెనక గానీ, ట్రాక్టర్‌తో నడిచే ఎరువులు, విత్తనాన్ని ఒకేసారి వేసే గొర్రుతో గానీ వేసేకోవచ్చు. అయితే విత్తనం పై పొరల్లో పడేటట్లుగా రైతులు చూసుకోవాల్సి ఉంటుంది.

'నాటు' మూడు పద్ధతులు

నారుమడి లేకుండా 'మూడు' పద్ధతుల్లో నాటు వేసుకోవచ్చు. అందులో 1. దమ్ము చేసిన పొలంలో నేరుగా విత్తే పద్ధతి. 2. ట్రేలలో నారు పెంచి యంత్రాలతో నాటు వేయడం. 3. ఆరుతడి (ఎరోబిక్ రైస్) పద్ధతి. రైతులు తమకు అనుకూలమైన పద్ధతులలో వరి సాగు చేసుకోవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలి



"రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంట ముందుకు వచ్చే స్వల్పకాలిక రకాలను ఎంపిక చేసుకోవాలి. నారు మడి లేకుండా నేరుగా మొలకెత్తిన విత్తనాలు చల్లడం, యంత్రాలతో నాటు వేయడం ద్వారా ఖర్చు తగ్గించుకోవచ్చు. ఇక ఆరుతడి విధానంలో అయితే మిగతా పంటల మాదిరిగానే అవసరమున్నప్పుడే నీరు పెట్టుకోవాలి.

–డాక్టర్ ఆగుర్ల రాజు, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

సమస్యల పరిష్కారానికి దశల వారీగా పోరాటం

- రేపు, ఎల్లుండి బైక్ ర్యాలీలు
- ఆగస్టు 12న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పోరాట కమిటీ రాష్ట్ర, జిల్లాల బాధ్యులు

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో దశవారీగా పోరాటాలను నిర్వహించాలని పిలుపునిస్తున్నట్లు ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర కమిటీ నాయకులు కె.సోమశేఖర్, కడారి భోగేశ్వర్, అటుకుల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పోరాట కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీ కమిటీని వేయాలని జూలై 1 నుంచి మధ్యంతర భృతిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొత్తంగా 30 రకాల డిమాండ్లతో దశలవారీగా పోరాట కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. తొలిదశలో ఈనెల 18,19 తేదీల్లో అన్ని మండలాల్లో ఉపాధ్యాయులు బైక్ ర్యాలీలు, ఆగస్టు 12న జిల్లా కేంద్రాల్లో ర్యాలీలు, ధర్నాలు నిర్వహిస్తారన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోతే సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ హనుమకొండ, వరంగల్ జిల్లాల బాధ్యులు టి.కుమార్, మనోజ్‌కుమార్, టి సుదర్శనం, పెండెం రాజు, బద్దం వెంకటరెడ్డి, రఘువీర్, కె మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జాబ్ ఇస్తామని..డబ్బు లాగేశారు

- నిరుద్యోగులను మోసం చేసిన సైబర్ నేరగాళ్లు
- బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు


సైబర్‌నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రామకృష్ణ, ఎస్ఐ శ్వేత

గీసుకొండ: 'మీకు మా సంస్థలో పర్మినెంట్ జాబ్ ఇప్పిస్తాం.. కొన్ని టాస్కులు, ఫార్మాలిటీలు కంప్లీట్ చేస్తే చాలు'..అంటూ నమ్మించిన సైబర్ నేరగాళ్లు.. ఇద్దరు నిరుద్యోగుల నుంచి డబ్బు లాగేసిన ఘటనలు గీసుకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు కథనం ప్రకారం గ్రేటర్ వరంగల్ నగరం 15వ డివిజన్ గొర్రెకుంటకు చెందిన గృహిణి మైదం రజిని ఇన్‌స్టాగ్రాం అకౌంట్‌లో.. జూన్ 9న మైదం రజని పేరుతో పార్ట్ టైం జాబ్ అడ్వర్టయిజ్ మెంట్ పెట్టి 8930536382 సెల్ నంబర్‌తో చాట్ చేసి తమకు ఉద్యోగం కల్పించే సంస్థ ఉందని నమ్మించారు. ఆమె టెలిగ్రాం అకౌంట్‌తో చాట్ చేసి కొన్ని టాస్కులు పూర్తి చేస్తే తమ సంస్థలో పర్మినెంట్ ఉద్యోగి అవుతారని నమ్మించారు. సుభాష్ పేటీఎం, ఆశిష్ పేటీఎం అకౌంట్‌లకు పలు విడతల వారీగా రూ. 29 వేలు రజని వద్ద నుంచి డ్రా చేశారు. జరిగిన మోసాన్ని గ్రహించిన బాధితురాలు సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేయగా ఆదివారం కేసు నమోదు చేసినట్లు గీసుకొండ సీఐ కె. రామకృష్ణ తెలిపారు.

అలాగే, గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ గరీబ్‌నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఓర్సు రమేశ్ మరోలా మోసపోయారు. ఈ ఏడాది ఏప్రిల్ 29న అతడికి ఇన్‌స్టాగ్రామ్ సోషల్ మీడియా యాప్‌లో ఉద్యోగం విషయమై ఓ యాడ్ వచ్చింది. ఆ యాడ్‌లో ఇచ్చిన సెల్ నంబర్‌కు అతడు ఫోన్ చేయగా తాము ఇచ్చిన టాస్క్ పూర్తి చేస్తే తమ సంస్థలో పర్మినెంట్ ఉద్యోగం ఇస్తామని నమ్మించడంతోపాటు ఆ సంస్థలో డబ్బు పెట్టుబడిగా పెట్టాలని అతడిని నమ్మించారు. వారు ఇచ్చిన అకౌంట్‌కు పలు మార్లు మొత్తం రూ. 30 వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. చివరికి అది ఫేక్ అని , తాను మోసపోయానని తెలుసుకుని సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేయగా ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ కె. రామకృష్ణ తెలిపారు. కాగా ఈ విషయమై గీసుకొండ సీఐ రామకృష్ణ, ఎస్ఐ శ్వేత గీసుకొండలో బాధితులు, గ్రామస్తులకు ఆదివారం అవగాహన కలిగించారు. అపరిచితులతో సెల్ ఫోన్లలో చాటింగ్ చేయడం, వారికి ఓటీపీ చెప్పడం, బ్యాంకు అకౌంట్ నంబర్లు ఇవ్వడం, తదితర పనులు చేయొద్దని సూచించారు.

చైన్ స్నాచింగ్‌కు యత్నం

ఖిలా వరంగల్: దుండగుడు.. ఓ మహిళ మెడలోని చైన్ స్నాచింగ్‌కు యత్నించాడు. ఈ క్రమంలో భర్త రాకను గమనించి చైన్‌ను వదిలేసి పారిపోయినట్లు మిల్స్‌కాలనీ సీఐ ముస్క శ్రీనివాస్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం వరంగల్ కరీమాబాద్‌కు చెందిన పుప్పాల రమణ(30) ప్రైవేట్ ఉద్యోగంతోపాటు వర్క్‌ఫ్రమ్ హోంగా పనిచేస్తూ తన కుటుంబాన్ని పోషిస్తోంది. రోజులాగానే ఆదివారం తెల్లవారు జామున ఇంటి ప్రాంగణంలో వాష్‌రూమ్‌కు వెళ్లింది. ఈ క్రమంలో ఓ దుండగుడు ఆమె వెంటపడి బంగారు చైన్‌ను లాక్కునేందుకు యత్నించారు. భర్త రాకతోపాటు ఆమె గట్టిగా కేకలు వేయడంతో దుండగుడు చైన్ వదిలేసి పరిపోయాడు. ఈ ఘటనపై మంద సుమన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

దోర్నకల్: పెరుమాళ్లసంకీస శివారులో పేకాడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు దోర్నకల్ సీఐ బి.ఉపేందర్‌రావు తెలిపారు. మరో ముగ్గురు పారిపోయినట్లు తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.6,800 నగదు, మూడు సెల్‌ఫోన్లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

'పేరిణి' విశ్వవ్యాప్తం కావాలి


మహోత్సవంలో నృత్యకళాకారులు

- 'కుడా' చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్
- వైభవంగా నృత్య మహోత్సవం

హన్మకొండ కల్చరల్ : పేరిణి నృత్యం విశ్వవ్యాప్తం కావాలని, సీఎం కేసీఆర్‌కు వరంగల్ అంటే ఎనలేని అభిమానమని.. దీనికి నిదర్శనమే కోట్ల రూపాయలతో కాళోజీ కళాక్షేత్రం నిర్మించడమని 'కుడా' చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. ఆదివారం సాయంత్రం హన్మకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరెళ్ల వేణుమాధవ్ ప్రాంగణంలో నాట్యగురువు పద్మశ్రీ నటరాజ రామకృష్ణ శతజయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, హన్మకొండ నటరాజ కళాకృష్ణ నృత్య జ్యోతి అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో 'బంగారు తెలంగాణలో పేరిణి నృత్య మహోత్సవం – 2023' వైభవంగా జరిగింది. అకాడమీ గౌరవఅధ్యక్షుడు డాక్టర్ బండెల మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుందర్‌రాజ్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాది మంది విద్యార్థులకు డ్యాన్స్ ఆఫ్ వారియర్స్‌గా పిలువబడే పేరిణి నృత్యంలో శిక్షణనిస్తున్న గురువులు గజ్జెల రంజిత్, నవ్యజ దంపతులు అభినందనీయులన్నారు. కాగా, గజ్జెల రంజిత్, నవ్యజ.. పేరిణి నృత్య లాస్య అంశాలపై రూపకల్పన చేసిన ప్రదర్శనలు, విద్యార్థులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. విశ్వనాథ్, చిన్నికృష్ణ, శ్రవణ్, సాయి చరణ్ వాయిద్య సహకారం అందించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన అకాడమీ విద్యార్థులు తేజస్విని, సలేంద్ర, సాహితీప్రియ, హన్సికారెడ్డి, స్నావెస్లా, సింధుకు ప్రతిభాపురస్కారాలు అందజేశారు. సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో డీపీఆర్వో లక్ష్మణ్, విధుమౌళి, చంద్రకళ రామకృష్ణ, పీవీ మదన్‌మోహన్, సదానందం పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు
- మామునూరు, శంభునిపేట సబ్‌స్టేషన్ల పరిశీలన


తిమ్మాపురం సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న సీఎండీ గోపాల్‌రావు

ఖిలా వరంగల్/కరీమాబాద్: వినియోగదారులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎన్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్‌రావు అధికారులకు ఆదేశించారు. ఆదివారం ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురం క్రాస్‌రోడ్డు, శంభునిపేట, మామునూరు 33/11 కేవీ సబ్‌స్టేషన్లను ఉన్నతాధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ సరఫరాను స్వయంగా పరిశీలించారు. అనంతర ఆయన మాట్లాడుతూ అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని, ఎద్దైనా సమస్య తలెత్తితే ఏఈలు, లైన్‌మెన్లు తక్షణమే స్పందించి పునరుద్ధరణ చర్యలు చేపట్టాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది హెడ్‌క్వార్టర్‌లో ఉండాలని సూచించారు. సబ్ స్టేషన్ ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి వాటి స్థానంలో పండ్ల మొక్కలను పెంచాలని చెప్పారు. సీఎండీ వెంట వరంగల్ సూపరిటెండెంట్ ఇంజనీర్ మధుసూదన్, పౌర సంబంధాల అధికారి రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

'సమన్వయ' లోపం

- 'బీసీ' రుణ దరఖాస్తులపై ఏకపక్ష నిర్ణయం
- ఎంపీడీఓతో కమిటీ సభ్యుల వాగ్వాదం

హసన్‌పర్తి: బీసీ రుణ లబ్ధిదారుల జాబితాపై అగ్గిరాజుకుంది. ఎంపీడీఓ, మండల సమన్వయ కమిటీ సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకున్న విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. లబ్ధిదారుల ఎంపిక జాబితా విషయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఏకపక్షంగా వ్యవహరించినట్లు ఆరోపిస్తున్నారు. రూ.లక్ష రుణం కోసం దరఖాస్తులు స్వీకరించగా మండలం నుంచి 981 వచ్చాయి. గ్రామాల వారీగా విభజించి పరిశీలించారు. ఆ తర్వాత క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేపట్టారు. ఆయా గ్రామాలకు ఎంపీడీఓ స్వయంగా వెళ్లి విచారించారు. ఇదిలా ఉండగా.. గ్రామాల వారీగా ఎన్ని దరఖాస్తులు వచ్చాయనే సమాచారం తమకు ఇవ్వలేదని సమన్వయ కమిటీ సభ్యులు ఎంపీడీఓతో వాగ్వాదానికి దిగినట్లు ప్రచారం. రెండు రోజుల క్రితం ఎంపీడీవో కార్యాలయంలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలిసింది. నిరుపేదలు ఉన్నా జాబితాలో చోటు కల్పించలేదని వారు ఆరోపిస్తున్నారు.

డబ్బుల వసూలు?

బీసీ రుణ దరఖాస్తు దారులతోపాటు దళిత బంధు కోసం కొంతమంది దళారులు పలువురి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొందరు ప్రజాప్రతినిధులు సైతం వారికి సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. మండల వ్యాప్తంగా తొలి విడత 40 మందికే రుణం మంజూరైనట్లు సమాచారం. ఈ విషయాన్ని అధికారులు మాత్రం ధ్రువీకరించడంలేదు.

ఓపీఎస్ అమలు చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర, జిల్లాల బాధ్యులు

- టీఆర్‌టీఎఫ్ రాష్ట్ర చీఫ్ ప్యాట్రన్ సంజీవరెడ్డి, ఏపీ, అండ్ టీఎస్ కోకన్వీనర్ విష్ణుమూర్తి

విద్యారణ్యపురి: రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు నూతన పింఛన్ విధానం రద్దు చేసి పాత పింఛన్ విధానం (ఓపీఎస్) అమలు చేయాలని డిమాండ్‌తో నిర్వహించనున్న సంకల్ప రథయాత్రను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) రాష్ట్ర చీఫ్ ప్యాట్రన్ లక్కిరెడ్డి సంజీవరెడ్డి, ఉభయ రాష్ట్రాలు ఏపీ, అండ్ టీఎస్ కోకన్వీనర్ ద్రాక్షపు విష్ణుమూర్తి కోరారు. ఈ మేరకు ఆదివారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్ సమీపంలో సంకల్ప రథయాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. టీఎస్‌సీపీఎస్‌ఈయూ ఆధ్వర్యంలో జోగులాంబ గద్వాల అలంపూర్‌లో ఈనెల 16న సంకల్పయాత్ర ప్రారంభమైందన్నారు. ఈ సంకల్పయాత్రకు టీఆర్‌టీఎఫ్ సంపూర్ణ మద్దతును ప్రకటించిందన్నారు. ఈనెల 21న హనుమకొండ, వరంగల్ జిల్లాలకు రానున్న ఈ సంకల్పయాత్రలో ఈ రెండు జిల్లాల ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఈఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగమూర్తి, బాధ్యులు జిన్నారపు బుచ్చన్న హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బాసిరి రాజిబాపురావు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు శ్రీపతి కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి వడ్డేకిషన్, జనగామ జిల్లా అధ్యక్షుడు ఎం శ్రీనివాస్, ప్రధాన కార్యదరిర్శి రామచంద్రం, ములుగు జిల్లా అధ్యక్షుడు రాజు, భూపాలపల్లి అధ్యక్షుడు కె రవీందర్, రాష్ట్రకమిటీ బాధ్యులు రాజేశ్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

మెడికల్ డివైజెస్ మార్పుపై త్వరలో నిర్ణయం

- డ్రగ్ కంట్రోలర్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కోటేశ్వర్‌రావు


కోటేశ్వర్‌రావును సన్మానిస్తున్న సమ్మయ్య

కేయూ క్యాంపస్: డ్రగ్స్, కాస్మోటిక్, మెడికల్ డివైజెస్ మార్పు చేసేందుకుగాను కేంద్ర ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకోబోతోందని డ్రగ్ కంట్రోలర్ ఆఫీసర్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కోటేశ్వర్‌రావు వెల్లడించారు. ఈమేరకు ఆదివారం కాకతీయ యూనివర్సిటీలోని ఫార్మసీ కళాశాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ డ్రగ్స్ కంట్రోలర్స్ ఆఫీసర్స్ అసోసియేషన్, పల్లవి బానోతు మెమోరీయల్ ట్రస్ట్ సంయుక్తంగా ఈనెల 23న కేంద్ర డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగాల కోసం ఆన్‌లైన్‌వెబ్‌నార్ ద్వారా అవగాహన సదస్సు నిర్వహించనున్నామన్నారు.రాబోయేరోజుల్లో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగుల నియామకాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో బీఫార్మసీ పూర్తిచేసుకున్న అభ్యర్థులు ఈనెల23 నిర్వహించనున్న అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం కోటేశ్వర్‌ను ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ గాదె సమ్మయ్య సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ జైపాల్‌రెడ్డి, బీఎస్‌ఎఫ్ కేయూ ఇన్‌చార్జి బొట్లమనోహర్, వినయ్‌కుమార్, విగ్నేశ్వర్, తిరుపతి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.